క్లుప్తంగా

ఘనంగా శివపార్వతుల వార్షిక కల్యాణం

పాలకొండ రూరల్: మండలంలోని నక్కలపేటలో కొలువుదీరిన మృత్యుంజయ మరకత లింగేశ్వర ఆలయంలో వార్షిక కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు పర్రి శరత్‌బాబు నేతృత్వంలో దంపతులు శివపార్వతుల కల్యాణం చేయించారు. అలాగే ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దేవస్థానంలో మార్గశిర లక్ష్మీవార పూజలు జరిగాయి. అర్చకులు దారలప్పాడి లక్ష్మీప్రసాద్ శర్మ, వేమకోటి మనిల్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో వందలాదిగా మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు.

16 నుంచి శిక్షణ

గరుగుబిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు, సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి గ్రామాభివృద్ధిపై ఈ నెల 16 నుంచి శిక్షణ రెండు విడతలలో ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి గురువారం తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో మరుపెంట, గిజబ, తోటపల్లి, నాగూరు, లఖణాపురం, రావివలస, చిలకాం, సంతోషపురం, సుంకి, ఉల్లిబద్ర, కొంకడివరం, ఉద్దవోలు, దళాయివలస గ్రామాల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే 18, 19 తేదీల్లో గరుగుబిల్లి, గొట్టివలస, శివాకవం, కొత్తూరు, రావుపల్లి, కొత్తపల్లి, పెద్దూరు, బివి.పురం, చినగుడబ, వల్లరిగుడబ, ఆర్‌డి.వలస, పెదగుడబ, ఎస్‌ఆర్ పేట గ్రామాల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆయా తేదీల్లో సంబంధిత అధికారులు శిక్షణకు హాజరు కావాలని ఆమె ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీతంపేట: మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నీలిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

సీతంపేట: ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీఓ కె.గీతాంజలి తెలిపారు. సోమగండి గ్రామ సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. ఆ సమయంలో వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి సింహాచలం, వీఆర్‌ఓ తులసిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో మేలు

గరుగుబిల్లి: ప్రకృతి సేద్యం ఎంతో శ్రేయోదాయకమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు ప్రాంగణంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల గ్రామ సంఘ సభ్యులకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత ఆహారం తినడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రకృతి పద్ధతుల్లో సేద్యం చేస్తే ఆహారం కలుషితం కాకుండా ఉంటుందని, దీంతో చాలా వరకు రోగాలను అధిగమించవచ్చునన్నారు. ప్రతీ కార్యకర్త గ్రామాల్లోని రైతులకు పోషక విలువలతో కూడిన పంటలను పండించేలా అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో భాగంగా తోటపల్లిలోని రెడ్డి శ్యామల పంట పొలంలో ఏటీఎం మోడల్‌ను చూపించి ఖర్చు, ఆదాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్సుపర్సన్ వెంకట సత్య, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, శారద, యశోద తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సైబర్ నేరగాళ్ల వలలో పడి బ్యాంకు ఖాతాలోని నగదును పోగొట్టుకోకుండా ప్రజలు అప్రమత్తం కావాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. కురుపాం గ్రామంలో గురువారం జరిగిన వారపు సంత ప్రదేశం వద్ద పరిసర గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మత్తు పదార్థాలు, రోడ్ సేఫ్టీ, బాల్యవివాహాల పట్ల అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీని చెప్పడం వలన బ్యాంకు ఖాతాలోని నగదును దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా నమ్మిస్తుంటారని, అటువంటి వారి మాయమాటలకు లొంగకూడదన్నారు.



అమాత్యా.. హామీల అమలెప్పుడు..?

- ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తున్న ప్రజానీకం
- అన్నదాతలను... ఆడబిడ్డలను అవస్థల పాల్జేశారంటూ మండిపాటు
- పరిష్కారానికి నోచుకోని స్థానిక సమస్యలు



పాలకొండ రూరల్: కూటమి నాయకులు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ నమ్మబలికారు. నాడు అధికారమే పరమావధిగా ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించారు. అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తవుతోంది. కాని ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోవడంపై ప్రజానీకం మండిపడుతోంది. స్థానిక సమస్యలనే పరిష్కరించలేని కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ఎద్దేవా చేస్తున్నారు.

అన్నదాతను నట్టేట ముంచారు

అధికారంలోకి వచ్చేందుకు అన్నదాతను నెత్తిన పెట్టుకుంటామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ. 20 వేలు చొప్పున ఇస్తామని నమ్మబలికారు. ఖరీఫ్ సీజన్ ముగిసినా ఒక్క పైసా కూడా ఇంతవరకు ఇవ్వలేదు. దీంతో నియోజకవర్గంలోని సుమారు 48 వేల మంది రైతులు ఆర్థిక భరోసా కోసం ఎదురుచూస్తున్నారు. వరి పంటను కూడా కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో రైతులు దళారులకు విక్రయించాల్సి వచ్చింది. పంటబీమా విషయంలో కూడా రైతులను కూటమి నాయకులు మోసం చేశారు.

భవిష్యత్‌కు గ్యారెంటీ ఏదీ..?

భవిష్యత్‌కు గ్యారంటీ పేరిట సూపర్ సిక్స్ అమలు చేస్తామనటంతో ప్రజలు అధికారం కట్టబెట్టి ఆరు నెలలైంది. కూటమి హామీల అమలుపై ఎక్కడ చర్చించినా 18 ఏళ్లు నిండిన అక్కచెల్లెమ్మలు తమ ఆడబిడ్డ నిధి రూ.15 వందలు ఇంకా రాలేదని ఓటు వేసిన 94,328 మంది మహిళా ఓటర్లు అంటున్నారు. ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు రూ.15 వేల వంతున తల్లికి వందనం అందించడం లేదని 28,984 మంది బిడ్డల తల్లులు స్పష్టం చేస్తున్నారు. మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీలో నేటికీ స్పష్టత కొరవడిందిని 25,870 దీపం పథక లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం ఊసే ఎత్తకపోవడంతో ఆ పథకాన్ని దాదాపుగా తాము మరిచిపోయామని నాలుగు మండలాల పరిధిలో 1,23,572 మంది మహిళలు చెబుతున్నారు. ఇక అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలు తెలియజేయకపోవడంతో రూ.20వేలు అప్పు చేసి సాగు చేస్తున్నట్లు గతంలో లబ్ధి పొందిన 44వేల పైచిలుకు రైతులు వాపోతున్నారు. దీనికితోడు యువగళం పేరిట ప్రతి ఇంటికీ ఓ ఉద్యోగం లేకుంటే నిరుద్యోగికి నెలకురూ.3వేలు ఎప్పుడు ఇస్తారని దాదాపుగా 10,849 నిరుద్యోగ యువతీ, యువకులు ప్రశ్నిస్తున్నారు.


ఫెంగల్ తుపాను సమయంలో మండలంలో రైతు కష్టాలు (ఫైల్)

నాడు పవన్ ఏమన్నారంటే.....?

- ఈ ఏడాది మే నెల 2వ తేదీన వారాహి యాత్రలో భాగంగా జనసేన అధినేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాలకొండ బహిరంగ సభలో మాట్లాడుతూ....
- మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పాలకొండను బంగారుకొండగా మారుస్తాం.
- ఇక్కడి అపారమైన వనరులు అందిపుచ్చుకుని పర్యాటకరంగ ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం.
- పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తాం.
- పాలకొండ, సీతంపేట ఆస్పత్రులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా తీర్చిదిద్దుతాం.
- సీతంపేట, భామిని మండలాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉంది. ఇంటింటికీ రక్షిత నీరు అందించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.
- జగన్ మోహన్‌రెడ్డి హయాంలో గిరిజనులకు అన్యాయం జరిగింది. జీఓ – 3 అమలుకు ప్రయత్నిస్తాం.
- ఏనుగుల సమస్యను పరిష్కరిస్తాం.
- రద్దు కాబడిన గిరిజన పథకాలు పునరుద్ధరిస్తాం.
- తోటపల్లి ఆధునీకీకరణ, జంపరకోట జలశయ నిర్మాణం చేపడతామంటూ హామీలు గుప్పించారు. ఇందులో ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయారు.

సంక్షేమ పథకాలు పక్కనబెట్టారు..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను పక్కనబెట్టారు. దీంతో అన్నివర్గాల వారు నాటి జగనన్న ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారు. మహిళలు నమ్మి ఓట్లు వేశారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి ఇలా ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు.
– రణస్థలం రమాదేవి, సర్పంచ్, ఎం.సింగుపురం, పాలకొండ మండలం

రైతులపై భారం తగదు..



ఎన్నికల సమయంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. నియోజకవర్గంలో అధికులు సేద్యంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా రైతులకు చేసిందేమీ లేదు. పెట్టుబడి నిధులు అందించకపోవటంతో అప్పులు చేశాం. కొనుగోలు ఆలస్యం కావడంతో పాటు దళారులకు ధాన్యం విక్రయించాల్సి వచ్చింది. చివరకు బీమా ప్రీమియం కూడా రైతులే చెల్లించేలా భారం మోపడం తగదు.
– లావేటి శ్యామ్‌సుందర్, రైతు, నవగాం గ్రామం, పాలకొండ మండలం

కురుపాం నియోజకవర్గంలోని కొమరాడ మండలంలో పంటలను పాడు చేస్తున్న ఏనుగులు(ఫైల్)


హామీల అమలు కోసం ఎదురుచూపు

- ఎన్నికల వేళ ఇచ్చిన హామీల మాటేమిటి!
- కూటమి పాలనపై ప్రజల అసంతృప్తి గళం
- ఆరు నెలలైనా అతీగతి లేదు...



గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల వేళ కూటమి నేతలు ఇచ్చిన హామీల మాటలు కురుపాం నియోజకవర్గంలో నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఎన్నికల సమయంలో కురుపాం నియోజకవర్గానికి వచ్చిన చంద్రబాబుతో పాటు ఆయా మండలాల్లో పర్యటించిన ప్రస్తుత ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. సూపర్ సిక్స్ హామీలతో పాటు నియోజకవర్గంలో ప్రధాన సమస్యలైన ఏనుగుల సమస్య, కొమరాడ మండలంలో అర్ధాంతరంగా మిగిలిన పూర్ణపాడు – లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని, కురుపాం సమీపంలో గుమ్మిడిగెడ్డపై మినీ రిజర్వాయరు నిర్మిస్తామని, గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మిస్తామని, కొమరాడ మండలంలో జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూ హామీలిచ్చారు.

కొమరాడ మండలంలోని జంఝావతి ప్రాజెక్ట్‌ను పూర్తిచేస్తామంటూ హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా.. ఇచ్చిన ఏ హామీ నెరవేర్చేందుకు తీసుకుంటున్న చర్యలు కానరావడం లేదు.

జంఝావతి ఊసే లేదు



రైతులకు ఎంతో ఉపయోగపడే జంఝావతి ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామన్న కూటమి ప్రభుత్వం నేటికీ ఆ ఊసే పట్టడం లేదు. వైఎస్సార్ హయాంలో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్ట్ వలన సుమారు 12వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఒడిశాలో నెలకొని ఉన్న చిన్న వివాదం పరిష్కరించి తదుపరి పనులు చేపడితే ఈ ప్రాంతంలో సుమారు 24 వేల ఎకరాలకు నీరు అందుతుంది. ఈ ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు కృషి చేయాలి.
– నంగిరెడ్డి శరత్‌బాబు, వైస్ ఎంపీపీ, కొమరాడ

పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేసేదెప్పుడు!



ఎన్నికల ప్రచారం నిమిత్తం కురుపాం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పెండింగ్‌లో ఉన్న పూర్ణపాడు–లాబేసు వంతెన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఆరు నెలలు దాటుతున్నా.. ఆ హామీ నెరవేర్చే చర్యలు కానరావటం లేదు. ఈ వంతెన నిర్మాణ పనులు ఎప్పుడెప్పుడు పూర్తవుతాయా.. అని ఈ ప్రాంత ప్రజలంతా ఆశతో ఎదురు చూస్తున్నారు.
– ఏగిరెడ్డి సింహాచలం, సర్పంచ్, తొడుము

ఏనుగులను తరలించేందెప్పుడు..



నియోజకవర్గాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో ఏనుగుల సమస్య ప్రధానమైనది. అధికారంలోకి రాగానే ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించేస్తాం.. అంటూ ఎన్నికల్లో కూటమి నాయకులు ఊదరగొట్టారు. గెలిచాక ఆ ఊసే మరిచారు.
– అక్కేన త్రినాథ, రైతు, రామినాయుడువలస, జియ్యమ్మవలస మండలం

లిఫ్ట్ ఇరిగేషన్‌పై ప్రకటనేది?



తోటపల్లి ప్రాజెక్టు నుంచి జంఝావతి కాలువకు ఉల్లిబద్ర వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందిస్తామని ఎన్నికలలో హామీలిచ్చారు. ఇంతవరకు ఆ ప్రకటనకు సంబంధించి ఎలాంటి ప్రణాళికలు చేసిన దాఖలాలు లేవు. ఎన్నికల హామీల అమలుకు చర్యలు చేపట్టాలి.
– డి.మాధవనాయుడు, రైతు, రావుపల్లి

ఆరోగ్య సమస్యలు నమోదు చేయాలి

గరుగుబిల్లి: తనిఖీల కోసం వచ్చిన రోగుల ఆరోగ్య సమస్యలను విధిగా నమోదు చేయాలని వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని గొట్టివలస, రావుపల్లి గ్రామాల్లోని వెల్‌నెస్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఎంతమంది తనిఖీల కోసం వస్తున్నారని, చికిత్స వివరాలను ఓపీ రికార్డులో పరిశీలించారు. కేంద్రంలో ఉన్న వైద్య పరికరాలు, చేపడుతున్న పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు అంకితభావంతో తనిఖీలను నిర్వహించి అవసరమైన మందులను ఇవ్వాలన్నారు. దీర్ఘకాలిక రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తే తక్షణం ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట ఎపిడమిక్ ఈఓ సత్తిబాబు, సూపర్‌వైజర్ జై.గౌడ్ తదితరులున్నారు.


రావుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ

గరుగుబిల్లి: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్‌ను ధరిస్తే అనుకోని ప్రమాదం సంభవిస్తే ప్రాణాన్ని రక్షించుకొనేందుకు ఎంతో అవకాశం ఉంటుందని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని ఖడ్గవలస జంక్షన్‌లో హెల్మెట్ వినియోగంపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. సరైన పద్ధతిలో హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఏదో మొక్కుబడిగా హెల్మెట్‌ను ధరిస్తే ఉపయోగం ఉండదన్నారు. ప్రమాదం జరిగినపుడు హెల్మెట్ ఉంటే తలకు దెబ్బ తగలకుండా రక్షిస్తుందన్నారు. ప్రమాదాల వల్ల మరణాల సంఖ్యను కూడా తగ్గించవచ్చునన్నారు. వాహన చోదకులు రహదారి నియమాలను విధిగా పాటించాలన్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో రద్దీగా ఉన్న రహదారుల్లో నెమ్మదిగా వాహనాలను నడపాలన్నారు. ఆయనతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నీటి సంఘ ఎన్నికలకు ఏర్పాట్లు

వీరఘట్టం: ఈ నెల 14న జరగనున్న నీటి వినియోదారుల సంఘాల ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు జలవనరులశాఖ ఏఈ డీవీ రమణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 13 నీటి సంఘాలుండగా.. వాటిలో పది మేజర్, మూడు మైనర్ సంఘాలున్నట్లు చెప్పారు. కంబర, నడిమికెల్ల, విక్రమపురం, కొట్టుగుమ్మడ, నడుకూరు, చిదిమి, వీరఘట్టం, తెట్టంగి, తూడి, వండువ మేజర్ నీటి సంఘాలు కాగా.. సంత నర్సిపురం, నీలానగరం, కుంబిడి మైనర్ నీటి సంఘాలని తెలిపారు. ఆయా సంఘాల పరిధిలో 138 టీసీలు ఉండగా..ఎన్నిక నిర్వహించనున్న కేంద్రాలను ఇప్పటికే గుర్తించామన్నారు.

14న నీటి సంఘాల ఎన్నికలు..

భామిని: ఈ నెల 14న నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నీటి సంఘాల ఎన్నికల కో ఆర్డినేటర్ ఆర్.మధు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికకు అవసరమైన సామగ్రి పంపిణీ చేశారు.

అందరి సహకారంతోనే సుస్థిర అభివృద్ధి

జియ్యమ్మవలస: అందరి సహకారంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ ఎస్.రమేష్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం, వెలుగు కార్యాలయంలో సామాజిక న్యాయం, సుస్థిర అభివృద్ధి ఎలా సాధించాలనే అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ బొంగు సురేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వనరుల లభ్యత, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఎంటీలుగా పీఆర్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వెలుగు ఏపీఎం, ఐసీడీఎస్, వైద్య శాఖకు సంబంధించిన వారు ఉంటారన్నారు. సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి..

పాలకొండ : హస్తకళపై అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సీతంపేట ఐటీడీఏ ఏపీఓ జి. చిన్నబాబు అన్నారు. పట్టణంలోని ఆస్పత్రి సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో హ్యాండీక్రాఫ్ట్స్ డవలప్‌మెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ, హస్తకళలో శిక్షణ పొందిన కళాకారులకు చేయూత అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో షెడ్ డైరెక్టర్ పీడీ సుధీర్‌కుమార్, న్యూ హోప్ ఫౌండేషన్ చైర్మన్ బేతాళ సుదర్శన్ బెన్హర్, అపర్ణ లక్ష్మీ, ఐఎస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

సీతంపేట: గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని డీఎంహెచ్ఓ విజయపార్వతి అన్నారు. స్థానిక వైటీసీలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణుతో మాట్లాడుతూ, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం..

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

భామిని: మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని రైతులు నిల్వ చేసిన ముడి పత్తిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటులో మార్కెట్ కమిటీ అధికారులు చేస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని సూచించారు. 14న జరగనున్న నీటి సంఘాల ఎన్నికలపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.రవిరాయుడు, ఎం.జగదీశ్వరరావు, భూపతి ఆనందరావు, జనసేన మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, తదితరులున్నారు.

హర్షణీయం..

పాలకొండ రూరల్: డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి ప్రకటించడం హర్షణీయమని ప్రముఖ యోగా శిక్షకుడు కె.జనార్దనరావు అన్నారు. నేటి యాంత్రిక సమాజంలో ధ్యానంతోనో ఒత్తిడిని జయించవచ్చని చెప్పారు. గురువారం స్థానిక రుషీ యోగా కేంద్రంలో సాధకులకు ఆసనాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంతో పాటు పలు దేశాల ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఇటీవల ఈ నిర్ణయం తీసుకుందన్నారు. భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ ఈ విషయాన్ని తన ఎక్స్ వేదికగా ప్రకటించం జరిగిందని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ఈ నెల 21న ప్రతి ఒక్కరూ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు.

అవగాహన సదస్సు..



పాలకొండ రూరల్ : పాలకొండలోని జనచేతన సంస్థ కార్యాలయంలో నిర్వాహకుడు బి.శశిభూషణ చౌదరి నేతృత్వంలో నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అకౌంటింగ్ ట్యాక్సేషన్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా ఈ సదస్సు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రెచ్చిపోతున్న మందుబాబులు..

- ఇబ్బంది పడుతున్న స్థానికులు

వీరఘట్టం: నిన్న మొన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న వీరఘట్టం ప్రధాన రహదారిలో నేడు మందుబాబుల చేష్టలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ షాపుల వద్ద ఏ రోజు ఏ గొడవ జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఈనెల 10వ తేదీన స్టేట్‌బ్యాంక్ సమీపంలో ఉన్న ఎస్ఎస్ మద్యం దుకాణం వద్ద రాత్రి 10 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు మద్యం సీసాలను పగలగొట్టి, షాపు వద్ద బ్యానర్లు చించేసి గలాటా చేశారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో తగాదా సద్దుమణిగింది. అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో వీరఘట్టం తహసీల్దార్ కారులో వస్తుండగా.. తెలగవీధి జంక్షన్ సమీపంలో ఉన్న వైన్‌షాపు నుంచి మద్యం కొనుగోలు చేసి ఓ వ్యక్తి అకస్మాత్తుగా కారుకు ఎదురుగా రావడంతో అతన్ని తప్పించబోయి, పక్కనే ఉన్న డివైడర్‌కు కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తహసీల్దార్‌కు గాయాలు కావడంతో తలకు నాలుగు కుట్లు కూడా పడ్డాయి. తాజాగా బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో తెలగవీధి జంక్షన్ సమీపంలో ఉన్న వైన్‌షాపు వద్ద మందుబాబుల మధ్య జరిగిన గొడవ కొట్లాటకు దారితీసింది. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు వచ్చి మందుబాబులను చెదరగొట్టారు. మందుబాబుల వల్ల ఇబ్బందిగా ఉందని, షాపును ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


వీరఘట్టం మెయిన్‌రోడ్డులో గొడవ పడుతున్న మందుబాబులను చెదరగొడుతున్న పోలీసులు

